సాక్షి
కర్నూలు
శనివారం ; 9 ; డిసెంబర్ ; 2023



శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాస చివరి శుక్రవారం మల్లన్న క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు.



560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం 560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో కేసీ కాల్వకు 552 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కర్నూలు(సెంట్రల్): జగనన్న విద్యా దీవెనలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో నగదు జమ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించే అవకాశముంది. ఈ నేపథ్యంలో ముందస్తుగా సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. నగరంలోని ఓమెగా హాస్పిటల్ ప్రాంగణంలో హెలిప్యాడ్, సభా వేదిక కోసం కేంద్రీయ విద్యాలయ సమీపంలో ఖాళీ స్థలాలను పరిశీలించారు. పూర్తిస్థాయి పర్యటన షెడ్యూల్ ఖరారు కాగానే ప్రొటోకాల్ ప్రకారం సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరి వెంట కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు తదితరులు ఉన్నారు.

క్వింటా మిర్చి రూ.23,786

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధర ఆశాజనకంగా ఉంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు దిగుబడుల తాకిడి పెరుగుతోంది. శుక్రవారం 488 క్వింటాళ్ల మిర్చి మార్కెట్‌కు రాగా.. గరిష్ట ధర రూ.23,786, కనిష్టం ధర రూ.2,599, లభించింది. మోడల్ ధర రూ.15,109 నమోదైంది. మార్కెట్‌కు తొమ్మిది మంది రైతులు 31 క్వింటాళ్ల కందులు తీసుకురాగా.. కనిష్ట ధర రూ.2,669, గరిష్ట ధర రూ.10,190 లభించింది. ఉల్లి ధరలు నిలకడగా ఉంటున్నాయి. మార్కెట్‌కు ఉల్లి 2,651 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.409, గరిష్ట ధర రూ.3,740, మోడల్ ధర రూ.2,666 నమోదైంది.

కౌమార విద్యపై హెచ్‌ఎంలకు శిక్షణ

కర్నూలు సిటీ: కౌమార విద్యపై ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు శుక్రవారం స్థానిక డైట్ కాలేజీలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధరా దేవి మాట్లాడారు. కౌమార దశలో ఉన్న విద్యార్థినులకు అర్థం అయ్యే విధంగా పాఠాలు ఎలా బోధించాలో వివరించారు.

నిబంధనల మేరకు 'నిషేధిత' తొలగింపు

కర్నూలు(సెంట్రల్): 20 ఏళ్ల క్రితం పొందిన అసైన్డ్ భూములను నిబంధనలు మేరకు నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఆర్‌డీఓలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో శుక్రవారం ఉదయం ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అసైన్డ్ భూములను 22ఏ నుంచి తొలగించే సమయంలో డీఆర్ ఫైల్, ఆర్ఎస్ఆర్ డాక్యుమెంట్, పాత ఆర్ఓఆర్, పాత అడంగల్‌లో ఏదో ఒక్క దానిలో రైతు పేరు ఉండాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈనెల 15 నుంచి ఆడుదాం-ఆంధ్ర క్రీడలు మొదలు కానుండడంతో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.



షెడ్లులో పెరుగుతున్న నాటు కోళ్లు



జీవనోపాధికి కొక్కొరొకో!

- పొదుపు మహిళల అభ్యున్నతికి సరికొత్త కార్యక్రమం
- జిల్లాలో నాటు కోళ్ల పెంపకం, ఉత్పత్తి
- హిఫర్ ఇంటర్నేషనల్ సహకారం
- మొదటి విడతలో 10 మండలాల్లో అమలు
- ప్రతి మండలంలో 100 మంది మహిళలకు మినీ పౌల్ట్రీషెడ్లు

గ్రామీణ పొదుపు మహిళల జీవనోపాధులను మరింత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నాటుకోళ్ల ఉత్పత్తి, పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఆసక్తి ఉన్న మహిళలకు మినీ పౌల్ట్రీ షెడ్లు మంజూరు చేస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లో నాటు కోడి మాంసానికి, గుడ్లకు డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనాటుకోళ్ల పెంపకంలో రాణించేందుకు వందలాది మహిళలు ఆసక్తి చూపుతున్నారు. మహిళల ఆసక్తి గమనించిన రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ-వైకేపీ ఆధ్వర్యంలో మినీ పౌల్ట్రీ షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. అనంతపురం జిల్లా నార్పలలో మినీపౌల్ట్రీ షెడ్‌ల ద్వారా మహిళలు విజయవంతంగా రాణిస్తున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు నార్పలకు వెళ్లి అధ్యయనం చేశారు. మొదటగా జిల్లాలోని 10 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇక్కడ విజయవంతం అయితే మిగిలిన అన్ని మండలాల్లో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు. నాటు కోళ్ల పెంపకానికి హిఫర్(హెచ్ఐఎఫ్ఈఆర్) ఇంటర్నేషనల్ అనే సంస్థ సహకారం అందిస్తోంది. షెడ్ రూపకల్పన, నిర్మాణం, కోడిపిల్లల పెంపకం తదితర వాటిపై ఈ సంస్థ ప్రతినిధులు మహిళలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారు.

వెయ్యి మంది మహిళలకు మినీ పౌల్ట్రీషెడ్లు

హిఫర్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో ఒక్కో మండలంలో 100 మంది మహిళలకు షెడ్లు నిర్మించనున్నారు. జిల్లాలోని 10 మండలాల్లో వెయ్యి మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. సెంటు స్థలంలో రూ.40 వేలతో షెడ్ నిర్మించి.. కోడిపిల్లలను సరఫరా చేస్తారు. షెడ్ చుట్టూ కాంపౌండు తరహాలో పిల్లులు, కుక్కల బెడద లేకుండా కంచె ఏర్పాటు చేస్తారు. కోళ్లు షెడ్, కంచె దాటి బయటికి వచ్చే వీలుండదు. షెడ్ నిర్మాణం పూర్తి అయిన తర్వాత తమిళనాడులోని అసిల్ జాతికి చెందిన ఒక్క రోజు వయస్సు ఉన్న 200 నాటు కోళ్ల పిల్లలను సరఫరా చేస్తారు. వీటిని ఎలా పెంచాలనే దానిపై మహిళలకు హిఫర్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇస్తారు.

చక్కటి అవకాశం



స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు పౌల్ట్రీ పరిశ్రమ చక్కగా తోడ్పడుతుంది. ఇప్పటి వరకు వ్యక్తిగతంగా పొదుపు మహిళలకు పెరటి కోళ్ల పెంపకానికి మాత్రమే అవకాశం కల్పించాం. తాజాగా జిల్లాలో నాటు కోళ్ల పెంపకం, ఉత్పత్తికి కూడ చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియ ఈ నెలలోనే కార్యరూపం దాల్చనుంది. జనవరి చివరిలోగా లక్ష్యాలను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నాం. నాటు కోళ్ల ఉత్పత్తి, పెంపకం ద్వారా ఒక్కో మహిళ నెలకు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం పొందవచ్చు.

– సలీమ్‌బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

పెరటికోళ్ల పెంపకం.. లాభదాయకం

నాటు కోళ్ల పెంపకాన్ని పరిశ్రమ తరహాలో అభివృద్ధి చేస్తూనే మరోవైపు పెరటికోళ్ల పెంపకాన్ని కూడా చేపడుతున్నారు. పొదుపు మహిళల కుటుంబాల్లో పోషకాహార లోపాలను నివారించడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందేందుకు పెరటి కోళ్ల పెంపకాన్ని చేపడుతున్నారు. 2022-23లో దాదాపు 3000 మందితో పెరటికోళ్ల పెంపకానికి అవకాశం కల్పించారు. 2023-24లో ఇప్పటి వరకు 900 మంది పొదుపు మహిళలకు నాటు కోళ్లు సరఫరా చేశారు. కిలోకుపైగా బరువు ఉన్న అసిల్ జాతి నాటు కోళ్లు పొదుపు మహిళలకు సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్కరి రూ.3,250 ధరతో 8 పెట్టలు, 3 పుంజుల ప్రకారం సరఫరా చేస్తారు. ఒక్కో కోడి ఏడాదికి 120 వరకు గుడ్లు పెడుతుంది. గుడ్లను అమ్ముకొని అదనపు ఆదాయం పొందవచ్చు.



మినీ పౌల్ట్రీ షెడ్

నాటు కోళ్ల ఉత్పత్తి కేంద్రాలు

ప్రతి మండలంలో 100 మినీ పౌల్ట్రీషెడ్లు ఏర్పాటు చేసి, ఇందులో నాలుగింటిని నాటు కోళ్ల ఉత్పత్తి కేంద్రాలుగా అభివృద్ధి చేస్తారు. 96 మంది నాటు కోళ్లను పెంచుతూ.. మాంసం, గుడ్లు అమ్ముకోవచ్చు. నలుగురు మాత్రం నాటు కోళ్ల ఉత్పత్తిని చేపట్టాల్సి ఉంది. గుడ్లు సేకరించడం, వాటిని పొదిగించడం, పిల్లలను పెంచడం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. నాటు కోళ్ల ఉత్పత్తి కేంద్రాల నుంచే మిగిలిన 96 మందికి ఎప్పటికప్పుడు నాటు కోళ్ల పిల్లలను సరఫరా చేస్తారు.

దాణా తయారీ కేంద్రాలు

నాటుకోళ్ల ఉత్పత్తి, పెంపకాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో వీటికి అవసరమైన దాణాపై కూడా డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు దృష్టి సారించారు. సూక్ష్మ పరిశ్రమల కింద దాణా తయారీ ప్రక్రియను చేపడుతున్నారు. యూనిట్ కాస్ట్ రూ.1.50 లక్షల వరకు ఉండగా... సీఎంఎఫ్ఎంఇ కింద 35 శాతం సబ్సిడీ ఇస్తారు. ప్రతి మండలంలో ఒక దాణా తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తారు. మండలంలోని పౌల్ట్రీషెడ్‌లకు ఇక్కడి నుంచి దాణా సరఫరా చేయనున్నారు.



అనంతపురం జిల్లా నార్పలలో పౌల్ట్రీపై అధ్యయనం చేస్తున్న అధికారులు (ఫైల్)

గృహ నిర్మాణాలకు ఆర్థిక తోడ్పాటు

- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇప్పటికే రూ.86.62 కోట్లు
- అడ్వాన్స్‌గా రూ.6.63 కోట్లు

కర్నూలు(అర్బన్): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల వేగం పెంచేందుకు ప్రభుత్వం అనేక రూపాల్లో లబ్ధిదారులకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సిద్దలింగమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 344 లేఅవుట్లలో గృహ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఆయా కాలనీల్లో రూ.20.10 కోట్లతో నీటి వసతి, రూ.4.75 కోట్లతో అప్రోచ్ రోడ్లతో పాటు అంతర్గత రహదారులను నిర్మించామన్నారు. అలాగే కాలనీల్లో విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన లబ్ధిదారులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు.



ఎం సిద్ధలింగమూర్తి, పీడీ, హౌసింగ్

- స్వయం సహాయక సంఘాల్లోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేలను రుణంగా అందిస్తున్నట్లు చెప్పారు.
- ఇప్పటి వరకు 34,419 మంది లబ్ధిదారులకు రుణాలు అందించాలని నిర్ణయించగా.. 24,751 మందికి రూ.86,62,85,000 వారి ఖాతాల్లో జమ అయ్యాయన్నారు.
- ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం విడుదల చేసే మొత్తంలోనే ఒక్కొక్కరికి రూ.20 వేలను అడ్వాన్స్‌గా కూడా అందిస్తున్నామన్నారు.
- ఇందుకు సంబంధించి 7,361 మంది లబ్ధిదారుల్లో ఇప్పటికే 3969 మందికి రూ.6,63,15,000 వారి ఖాతాల్లో జమ అయ్యాయన్నారు.

వాటర్‌షెడ్ కార్యక్రమాలపై 15 నుంచి సోషల్ ఆడిట్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహిస్తున్న వాటర్‌షెడ్ కార్యక్రమాలపై ఈనెల 15 నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. పీఎంకేఎస్ఎస్‌వై 2.0 కింద కర్నూలు జిల్లాలో 5, నంద్యాల జిల్లాలో 2 ప్రాజెక్టులను చేపట్టారు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఎంట్రీపాయింట్ యాక్టివిటీ, సహజ వనరుల అభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు కార్యక్రమాల కోసం దాదాపు రూ.9 కోట్లు వ్యయం చేశారు. ఈ వ్యయంపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: పేద అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన లక్ష్మికి ఆటోను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ మహిళల అభ్యున్నతి కోసం సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి ఆటో రిక్షా పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి అండగా నిలిచేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. యువతీ, యువకులకు డ్రైవింగ్‌లో ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను ఉపయోగించు కుని పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. పొదుపు మహిళలు సున్నా వడ్డీ రుణాలతో కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. లక్ష్మి డ్రైవింగ్ చేస్తుండగా.. ప్రభుత్వం మంజూరు చేసిన ఆటోలో కూర్చుని మంత్రి కొంత దూరం ప్రయాణించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, పార్టీ ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, డీఆర్‌డీఏ వైకేపీ ఏరియా కో-ఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఆటోను ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఓటరు అర్జీలకు 27లోపు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(సెంట్రల్): ఓటరు ముసాయిదా జాబితాలో సవరణ కోసం వచ్చిన అర్జీలను డిసెంబర్ 27లోపు పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు. మార్పులు, చేర్పులతోపాటు 18 ఏళ్లు నిండిన వారి నుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తులను శనివారం అర్ధరాత్రి వరకు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఓటరు సవరణ జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ముసాయిదా జాబితాపై సవరణల కోసం 3.18 లక్షల అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఇందులో కొత్తగా ఓటు నమోదు కోసం 27 వేల అర్జీలు వచ్చాయన్నారు. వీటన్నింటినీ డిసెంబర్ 22, 23 లోపు ప్రాసెస్ చేసుకొని 27వ తేదీ నాటికి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ఫిర్యాదుల కోసం నిర్దేశిత ఫారం 6, 7, 8లను సమర్పించాలని, అన్ని ఫిర్యాదులకు సమాధానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్, డీపీఓ నాగరాజునాయుడు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి కర్నాటి పుల్లారెడ్డి, బీజేపీ నుంచి సాయిప్రదీప్, నాగేంద్రకుమార్‌రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి మహ్మద్ షకీల్‌ఖాన్, టీడీపీ నుంచి నవీన్‌కుమార్, రాజు, సీపీఐ నుంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

అన్నదాతకు 'ఈ-నామ్' వరం

- వ్యాపారుల మధ్య పోటీతో గిట్టుబాటు ధరలు
- దేశం మొత్తంగా ఒక లాట్‌కు సగటున 5-9 మంది పోటీ
- ఆదోని మార్కెట్ యార్డులో ఒకలాట్‌కు 10-35 మంది పోటీ
- ఈ-నామ్‌లో ఆదోని మార్కెట్‌కు దేశంలో మొదటి స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): ఒకే దేశం... ఒకే మార్కెట్ నినాదంతో అమలు చేస్తున్న ఈ-నామ్ విధానం రైతులకు వరంగా మారింది. పంటల ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎక్కువ మంది పోటీ పడుతుండటంతో అన్నదాతలకు గిట్టుబాటు ధర లభిస్తోంది. దేశంలోని 585 వ్యవసాయ మార్కెట్లలో 'ఈ-నామ్'ను అమలు చేస్తున్నారు. దేశం మొత్తం మీద ఒకలాట్‌కు పోటీపడే వ్యాపారులు సగటున 5 నుంచి 8 మంది వరకు ఉన్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మాత్రం ఒకలాట్‌కు 10 నుంచి 35 మంది పోటీపడుతున్నారు. దీంతో ఈ మార్కెట్ 'ఈ-నామ్'లో దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

బిడ్డింగ్‌లో ఆదోని మొదటి స్థానం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అన్ని రకాల పంటల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. పత్తికొండ మార్కెట్ యార్డులో కేవలం టమాట క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉల్లిని కూడా ఈ-నామ్‌లోకే తెచ్చారు. ప్రతి రోజూ మార్కెట్లలోకి రైతులు తెచ్చే ప్రతి సరుకును ఈ-నామ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇందుకోసం మార్కెట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే లాట్ ఐడీ స్లిప్ వస్తుంది. వ్యాపారులు సరుకు నాణ్యతను పరిశీలించి లాట్ ఐడీ స్లిప్‌ను బట్టి రేట్ కోట్ చేస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2022-23లో ఈ-నామ్‌లో రూ.1336.95 కోట్ల విలువ క్రయవిక్రయాలు జరిగాయి. 2023-24లో ఇప్పటి వరకు రూ.800.58 కోట్ల విలువ క్రయవిక్రయాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ-నామ్‌లో కర్నూలు జిల్లాలోనే అత్యధిక లావాదేవీలు జరిగాయి. బిడ్డింగ్‌లో దేశంలోనే ఆదోని మార్కెట్‌కు మొదటిస్థానం ఉండగా... కర్నూలు మార్కెట్ 6వ స్థానంలో నిలిచింది. పోటీ అధికంగా ఉండటం వల్ల ఆదోని మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు ఎక్కువగా లభిస్తున్నాయి. 2022-23లో ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో 1,66,274 లాట్‌లు, 2023-24లో ఇప్పటి వరకు 92,876 లాట్లను ఈ-నామ్‌లో కొనుగోలు చేశారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో 2022-23లో 1,25,471, 2023-24లో 61,314, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో 2022-23లో 30149 , 2023-24లో 19961 లాట్లను ఈ-నామ్‌లో కొనుగోలు చేశారు.



ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

అన్ని మార్కెట్‌లకు ఉచితంగా ఇంటర్నెట్

క్రయవిక్రయాలు జరిగే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు,పత్తికొండ మార్కెట్ యార్డులకు మార్కెటింగ్ శాఖ ఉచితంగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించింది. వ్యాపారులు స్మార్ట్ ఫోన్‌లో ఈ-నామ్ పోర్టల్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎవ్వరికి వారు లాట్ ఐటీ స్లిప్‌లను బట్టి రేట్ వేయవచ్చు. అంతేగాక మార్కెట్‌ల్లో అవసరమైన కంప్యూటర్లు ఇంటర్నెట్‌తో ఈ-బిడ్డింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రావీణ్యం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. వ్యాపారులు ఎవరి లాగిన్‌లో వారే రేట్ కోట్ చేస్తారు. ఎవరు ఏ రేటు కోట్ చేశారో తెలిసే అవకాశం ఏ మాత్రం లేదు. వ్యాపారులు కుమ్మక్కు కావడం, సిండికేట్ అయ్యే అవకాశం ఉండదు.

గిట్టుబాటు ధర వచ్చింది



ఈ-నామ్ విధానంతో ఆన్‌లైన్‌లో ధర కోట్ చేస్తున్నారు. ఇందువల్ల పోటీ పెరిగి మెరుగైన ధరలు లభిస్తున్నాయి. గతంలో టెండర్లు మాన్యువల్‌గా వస్తుండటం వల్ల వ్యాపారులు సిండికేట్‌గా మారడం జరిగేది. ఆదోని మార్కెట్‌లో గురువారం 4 క్వింటాళ్ల పత్తి అమ్ముకోవడం జరిగింది. ఈనామ్ వల్ల పోటీ పెరుగడం వల్ల క్వింటాకు రూ.7174 ధర లభించింది. పత్తి ధరలు ఆశాజనకంగా ఉండటానికి వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడమే ప్రధాన కారణం. పత్తి కొనుగోలుకు ఈ-నామ్‌లో 20 నుంచి 30 మంది వరకు పోటీపడుతున్నారు.

– రామిరెడ్డి, బిల్లేకల్ గ్రామం, ఆదోని మండలం

వ్యాపారులకు ఏకీకృత లైసెన్స్



మార్కెట్‌లకు వచ్చే అన్ని రకాల పంటలను 100 శాతం ఈ-నామ్‌లో నిర్వహిస్తున్నాం. వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతుకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. వ్యాపారులకు ఏకీకృత లైసెన్స్ ఉంటుంది.

– నారాయణమూర్తి, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ



బీమా వచ్చింది

నేను గ్రామంలోనే వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేదాన్ని. నా భర్త చిన్న వెంకటేశ్వర్లు కర్నూలులో హమాలీ పని చేసే వారు. మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇద్దరు కుమార్తెలలో ఒకరు ఇంటర్, మరొకరు పదోతరగతి, కుమారుడు తొమ్మిదో తరగతి చవుతున్నారు. రోజు మాదిరిగానే హమాలి పనికి వెళ్లిన నా భర్త సాయంత్రం పని ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో మా ఊరు స్టేజీ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలని ఎంతో ఆశగా ఉండే వాళ్లం. ప్రమాదవశాత్తు భర్త మృతితో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మాకు వైఎస్సార్ బీమా ఉందని తెలియజేసి ,సకాలంలో బీమా వచ్చేలా చేశారు.

– శ్రీదేవి, చెట్లమల్లాపురం, కల్లూరు మండలం



ఇంటి పట్టా ఇచ్చారు

మాది సామాన్య కుటుంబం. సొంత ఇల్లు లేదు. కట్టుకునే స్తోమత లేదు. ప్రతి నెలా బాడుగలు చెల్లించ లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. గతంలోను ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పారు. కానీ ఎవ్వరూ ఇవ్వలేదు. మా సచివాలయంలో పనిచేసే వలంటీర్ ఇంటికి వచ్చి వివరాలు తీసుకున్నారు. ఇల్లు లేని విషయం చెప్పాం. పేరు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం కర్నూలు నగర శివారులోని రుద్రవరంలో 23 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చింది. అందులో నాకు వచ్చింది. ఒక్క రూపాయి ఖర్చు కాలేదు. పట్టా మంజూరు అయినట్లు తెలుసుకొని సచివాలయం వెళ్లా. ఇంటి పట్టా ఇచ్చారు. ప్రభుత్వం మాలాంటి సామాన్య పేదలకు ఉచితంగా ఇంటి పట్టాలు ఇవ్వడాన్ని ఎన్నటికి మరచిపోలేం.

– ఎస్. కళ్యాణమ్మ, రెవెన్యూ కాలనీ, కర్నూలు



రమణీయం.. లక్ష దీపోత్సవం

- బుగ్గరామేశ్వర క్షేత్రంలో కనులపండువగా కల్యాణం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు


స్వాముల వారికి కల్యాణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని దంపతులు

ఓర్వకల్లు: హరహర మహాదేవ.. శంభో శంకర.. పాహిమాం, రక్షమాం అంటూ భక్తుల నినాదంతో కాల్వబుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రం మార్మోగింది. లక్ష దీపోత్సవంతో వెలుగులీనింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్త మండలి సంయుక్త ఆర్థిక సౌజన్యంతో కార్తీక మాసం మూడో శుక్రవారం లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. ఆలయ గర్భగుడి దగ్గర నుంచి భాజాభజంత్రీల మధ్య పల్లకీలో తీసుకెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుంచారు. ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా స్వాముల వారి కల్యాణం జరిపించారు. దాదాపు గంటపాటు సాగిన స్వాముల వారి కల్యాణ తంతును భక్తులు కనులారా వీక్షించి ధన్యులయ్యారు. కల్యాణోత్సవం అనంతరం లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, పొదుపులక్ష్మీ మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగాథ్‌గౌడు దీపాలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 1,200 మంది దంపతుల చేత దీపోత్సవం నిర్వహించారు. భక్తులు వెలిగించిన దీప కాంతులతో క్షేత్రం శోభిల్లింది. ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణశర్మ కార్తీక దీపోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ఉత్సవం ముగిసిన తర్వాత భక్తులకు అల్పాహారాన్ని అందజేశారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

స్వాముల వారి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాల్వబుగ్గ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చంద్ర పెద్ద స్వామి, జీకే వెంగన్న, ధర్మకర్త మండలి సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎంఈ ఆమోదించాకే ఖర్చు చేశాం

- కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): తమ ప్రతిపాదనలను డీఎంఈ ఆమోదించాకే కాలేజ్ డేకు ఖర్చు చేశామని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజ్ డేకు డీఎంఈ అనుమతి లేకుండా చేశారని, రూ.20లక్షల దాకా డబ్బును వృథా చేశారని ఈనాడు దినపత్రికలో రాసిన కథనాలు అవాస్తవమని పేర్కొన్నారు. కాలేజీ మైదానం మరమ్మతులకు స్పోర్ట్స్ కమిటీ ఆమోదంతో రూ.1,99,440, ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్‌కు కల్చరల్ కమిటీ ఆమోదంతో రూ.1,20,000, కల్చరల్ కమిటీ ఆమోదంతో ఆడిటోరియంలో 80 చైర్ల రిపేరీకి రూ.1,20,107, స్పోర్ట్స్ కమిటీ ఆమోదంతో స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలుకు రూ.1,01,770, వాలీబాల్, బాడ్మింటన్ కోర్టు, త్రోబాల్ కోర్టు, మైదానంలో జంగిల్ క్లియరెన్స్‌కు, జ్ఞాపికలు, బహుమతులు తదితరాలకు రూ.2,80,000, కల్చరల్ కమిటీ ఆమోదంతో స్పోర్ట్స్ డే, కాలేజ్ డే సెలబ్రేషన్స్‌కు రూ.6,30,000.. కలిపి రూ.14,51,317 మొత్తాన్ని కేఎంసీ డెవలప్‌మెంట్ సొసైటీ నిధి నుంచి ఖర్చు చేశామని తెలిపారు.

18 నుంచి కర్నూలులో రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): నగర సమీపంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మైదానంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఖేలో- ఇండియా మహిళా రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి బి. రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు www.nsrs.kheloindia.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9393827585ను సంప్రదించాలన్నారు.

పరిశ్రమల్లో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రమాదాల నివారణకు తరచూ తనిఖీలు చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన


మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): అన్ని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ముందుస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాస్థాయి ప్రమాదాల నివారణ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి కమిటీలో సభ్యులుగా ఉన్న ఎస్పీ జి.కృష్ణకాంత్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ. నారాయణరెడ్డి, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాదు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ఒక చిన్న నిర్లక్ష్యం ఎంతో మంది ప్రాణాలు పోయేందుకు కారణమవుతుందన్నారు. ప్రమాదాల నివారణకు తరచూ తనిఖీలు చేయాలన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, సిబ్బందితోపాటు సమీపంలో నివాస ఉంటున్న ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ.నారాయణరెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర స్థాయి క్రైసిస్ గ్రూపు ఆదేశాల మేరకు ఫిబ్రవరిలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో మాక్ డ్రిల్ నిర్వహించామని, డిసెంబర్ 21న ఆల్కలీస్ పరిశ్రమలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునిప్రసాదు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మీ, ఆర్‌టీఓ రమేష్, డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య పాల్గొన్నారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న సీఐ ఎరిసా వలి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది

కోసిగి: జిల్లెడాకుల నాగరాజు హత్య కేసును కోసిగి పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన నాగిరెడ్డి అలియాస్ చేపల రాజును అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎరిసా వలి తెలిపిన వివరాల మేరకు.. కోసిగిలోని గాంధీనగర్‌కు చెందిన జిల్లెడాకుల నాగరాజు ఆడవారితో చనువుగా ఉండేవాడు. అదే కాలనీకి చెందిన నాగిరెడ్డి అలియాస్ చేపల రాజుకు గిట్టేది కాదు. వ్యక్తిగతంగా మనస్పర్థ పెంచుకుని నాగరాజును హతమార్చేందుకు పథకం పన్నాడు. స్థానిక గుజిరీ దుకాణంలో వేటకొడవలిని కొనుగోలు చేసి.. గత నెల 30వ తేదీ తెల్లవారుజామున బహిర్భూమి వెళ్లే సమయంలో అక్కడే కాపు కాచి బైక్‌పై వస్తున్న నాగరాజును వేటకొడవలితో తల, గొంతు భాగంలో నరికి, హత్య చేసి పరారయ్యాడు. గురువారం మధ్యాహ్నం చింతకుంట రోడ్డులో చేపల రాజును అరెస్ట్ చేసి విచారించగా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తిని, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో కోసిగి, కౌతాళం ఎస్ఐలు సతీష్‌కుమార్, నరేంద్రకుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం

- 15 వరకు నీటి విడుదలకు అవకాశం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) ఆంధ్ర సరిహద్దు 250 కి.మీ వద్ద శుక్రవారం 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఈ నెల 10వ తేదీ వరకు ఏపీ వాటా నీరును వదులుతున్న టీబీ బోర్డు అధికారులు కర్ణాటక రైతు సంఘం నాయకుల డిమాండ్ మేరకు 15వ తేది వరకు కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవంగా కాలువకు వదిలే ఏపీ వాటా నీటిని ఇక్కడి రైతులతో పాటు కర్ణాటక రైతులు మిరప, ఇతర పంటలకు వాడుకునే వీలుంది. ఇదిలాఉంటే టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1,633 అడుగులు కాగా.. శుక్రవారం 1,591.50 అడుగులతో 12.212 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 648 క్యూసెక్కులు కాగా.. ఔట్‌ఫ్లో 2,498 క్యూసెక్కులుగా నమోదైంది. గతేడాది టీబీ డ్యాంలో ఇదే సమయానికి 1,628 అడుగుల వద్ద 89 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బనగానపల్లె రూరల్: రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిన్నరాజుపాళెం గ్రామానికి చెందిన బాలనరసింహులు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు కాశీవిశ్వనాథ్(22) ఇటీవల డిగ్రీ పూర్తి చేసి, గౌండ పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం యాగంటిపల్లెలో పనులు ముగించుకుని తన స్నేహితుడిని పలకరించేందుకని బైక్‌పై బనగానపల్లెకు బయల్దేరాడు. కృషివిజ్ఞాన కేంద్రం వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో కాశీవిశ్వనాథ్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం బనగానపల్లె వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఐ కాలేకపోయానని మనస్తాపం

- పురుగు మందుతాగిన యువకుడు


చికిత్స పొందుతున్న రాజు

పత్తికొండ రూరల్: ఎస్ఐ కాలేకపోయానని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం పత్తికొండ మండల పరిధిలోని పందికోన గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు, లక్ష్మి దంపతుల కుమారుడు ఆర్వేటి రాజు డిగ్రీ వరకు చదువుకున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన సచివాలయ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుని ఉద్యోగాన్ని సాధించలేకపోయాడు. గతంలో ఎస్ఐ నోటిఫికేషన్‌లో శారీరక దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేసుకుని రాత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. ఎలాగైనా ఎస్ఐ కావాలని కలలు కని రెండోసారి ఎస్ఐ పోస్టుకు దరఖాస్తు చేసుకుని శారీరక దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి రాత పరీక్ష రాశాడు. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో అర్హత సాధించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. పొలంలో పంటకు మందు పిచికారీ చేసేందుకు వెళ్లి అక్కడే పురుగు మందు తాగి విషయాన్ని తండ్రి శ్రీనివాసులుకు ఫోనులో సమాచారం అందించాడు. గ్రామస్తులతో కలిసి పొలానికి చేరుకున్న శ్రీనివాసులు కుమారుడిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

కూల్‌డ్రింక్ అనుకొని కుక్క మందు తాగిన బాలిక

- పాప పరిస్థితి విషమం

గోనెగండ్ల: కూల్‌డ్రింక్ అనుకొని కుక్క గాయానికి వాడే మందును తాగి ఏడేళ్ల బాలిక ప్రాణం మీదకు తెచ్చుకుంది. ఈ ఘటన పెద్దమరివీడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాలిక బంధువులు, గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కేశన్న, రోషమ్మలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. అందులో పెద్ద కూతురు పల్లవికి ఏడేళ్ల వయస్సు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం పిల్లలను అవ్వ దగ్గర వదిలి తల్లిదండ్రులు పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. పెంచుకున్న కుక్కకు దెబ్బతగలడంతో గాయం మానేందుకు మందు సీసాను తెచ్చి ఇంటి అరుగుపైన పెట్టారు. ఆరుబయట ఆడుకొని ఇంటికి వచ్చిన పల్లవి కూల్‌డ్రింక్ సీసా అనుకుని కుక్కమందు తాగేసింది. స్పృహ కోల్పోవడంతో గమనించిన అవ్వ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి చికిత్స నిమిత్తం హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యులు కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. పల్లవి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

క్లుప్తంగా

అక్రమంగా గ్రావెల్ తరలింపు

- 3 హిటాచీలను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు


సీజ్ చేసిన హిటాచీ వద్ద మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): ఓర్వకల్లు మండలం నన్నూరు, కల్లూరు మండలం తడకనపల్లె గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 863, 1292/2లో గ్రావెల్‌ను అక్రమంగా తరలించారని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గ్రావెల్ తరలింపునకు ఉపయోగించిన మూడు హిటాచీలను సీజ్ చేశామన్నారు. అక్రమ గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా దాడులు చేశామన్నారు. సీజ్ చేసిన హిటాచీలను వీఆర్‌ఓ సతీష్‌చంద్రకు అప్పగించామన్నారు. తనిఖీల్లో గనుల శాఖ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి


కాశీం(ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామానికి చెందిన రైతు కాశీం(46) పొలంలో పాముకాటుకు గురై మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గురువారం జొన్న పైరుకు నీరు పారించేందుకు వెళ్లాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో పొలంలోనే ఉండిపోయింటాడేమో అని కుటుంబీకులు అనుకున్నారు. శుక్రవారం ఉదయం విగతజీవిగా పడి ఉండటం చూసిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆళ్లగడ్డ ఆస్పత్రికి తరలించగా పాము కాటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గురమ్మతో పాటు కూతురు ఉంది.

ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ఎలీషా

గడివేముల: ఆటో ప్రమాదంలో శుక్రవారం ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన పలువురు గౌండ కూలీలు పనుల నిమిత్తం ఉదయం ఆటోలో నంద్యాలకు బయలుదేరారు. నంద్యాల-నందికొట్కూరు రహదారిలోని గ్రంధివేముల గ్రామం వద్ద ఆటో అదుపు తప్పడంతో ఎలీషా(40), రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఎలీషా మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న పీఓ రవీంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ రవీంద్రనాథ్‌రెడ్డి గిరిజనులకు సూచించారు. శుక్రవారం స్థానిక చెంచు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలందరికీ ఉన్నత విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందన్నారు. పిల్లలను బడికి పంపితే అమ్మ ఒడి డబ్బు, వసతి దీవెన, విద్యా దీవెన డబ్బుతో పాటు పుస్తకాలు, యూనిఫాం, షూ, బ్యాగ్‌లు, పౌష్టికాహారం, అందజేస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్స్ క్రిష్టానాయక్, సలోమీ, మాధవి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నంద్యాల జిల్లాకు మొదటిస్థానం

- 11వ స్థానంలో కర్నూలు జిల్లా

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముగిసింది. డిసెంబర్ నెలకు సంబంధించి పంపిణీ 7వ తేదీ వరకు కొనసాగింది. పలు జిల్లాల్లో మిచాంగ్ తుపాను ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల పింఛన్ల పంపిణీని ప్రభుత్వం రెండు రోజులు పొడిగించింది. పంపిణీలో నంద్యాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానం దక్కించుకోగా.. కర్నూలు జిల్లా 11వ స్థానంలో నిలిచింది. గ్రామ, వార్డు వలంటీర్లు వ్యయ ప్రయాసలకోర్చి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం విశేషం.

➡ కర్నూలు జిల్లాలో 2,45,320 పింఛన్లు ఉండగా 2,43,445 మంది లబ్ధిదారులకు రూ.67,71,76,00 నగదు పంపిణీ చేశారు. 99.22 శాతం పంపిణీ పూర్తయింది.

➡ నంద్యాల జిల్లాలో 2,21,508 పింఛన్లు ఉండగా 2,20,209 మంది లబ్ధిదారులకు రూ.60,80,61,250 నగదు పంపిణీచేశారు. 99.41 శాతం పంపిణీ పూర్తయింది.

భూ సర్వే పకడ్బందీగా చేపట్టండి


భూ సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ

గడివేముల: భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో జరుగుతున్న జగనన్న భూ సర్వేను తనిఖీ చేశారు. అనంతరం 220 కేవీ సబ్‌స్టేషన్ కోసం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అనుభవంలో ఉన్నవారికి శాశ్వత భూ హక్కు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ మాలిక్‌బాషా ఉన్నారు.

క్రీడా ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పతకాలు సాధించిన క్రీడాకారులకు వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాలు
- జిల్లా నుంచి నలుగురు ఎంపిక
- ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున అందజేత

కర్నూలు (టౌన్): ప్రతిభ చాటిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాలను అందిస్తోంది. వీటికి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అక్టోబర్ 26 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు గోవా రాష్ట్రంలో 37వ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గజ్జిహళ్లి గ్రామానికి చెందిన డి. వెంకటేష్ మోడ్రన్ పెంటాథ్లాన్ క్రీడాంశంలో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. అలాగే సెపక్‌తక్రా క్రీడాంశంలో కర్నూలు నగరానికి చెందిన సి. అశోక్‌కుమార్, సి. శివకుమార్, ఎస్‌కె. షేక్ మాలిక్‌బాషా సత్తా చాటి కాంస్య పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వీరిని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాలకు ఎంపిక చేసింది. వీరికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో నగదును జమ చేసింది. వ్యక్తిగత ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందించడంపై క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా వికాసం

రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు చేయూతనిస్తోంది. క్రీడల్లో ప్రతిభ చాటే క్రీడాకారులకు 2019 నుంచి వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాల పేరుతో నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. గత ప్రభుత్వం క్రీడలను పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడల నిర్వహణ చేయూతనిస్తోంది. దీంతో ఎంతో మంది క్రీడాకారులను వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీలు, ఏపీ సీఎం కప్ పోటీలు నిర్వహించింది. తాజాగా ఈనెల 15 నుంచి 50 రోజుల పాటు ఆడుదాం- ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చదువుతో పాటు క్రీడలను నిర్వహించడం, క్రీడావసతులు పెంచడం, క్రీడా మైదానాలను మెరుగుపరచడం వంటి చర్యలు చేపడుతోంది.

చాలా సంతోషంగా ఉంది



నేను ఎంబీఏ పూర్తి చేశా. ప్రస్తుతం అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నా. సెపక్‌తక్రా క్రీడ అంటే ఎంతో ఇష్టం. గతంలో క్రీడాకారులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఉండేవి కావు. ప్రస్తుత ప్రభుత్వం నా ప్రతిభను గుర్తించి రూ. 3 లక్షలు అందజేయడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి ప్రోత్సాకాలు ఇస్తే రాబోయే రోజుల్లో క్రీడలకు మరింత ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది.

– ఎస్‌కె. షేక్ మాలిక్ బాషా

క్రీడాకారుల సంఖ్య పెరిగింది



ప్రతిభ చాటుతున్న క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం శుభపరిణామం. రాబోయే రోజుల్లో మరింత మంది క్రీడాకారులు వెలుగులోకి రానున్నారు. గతంతో పోల్చితే మూడేళ్లలో జిల్లాలో క్రీడల్లో ప్రతిభ చాటుతున్న వారి సంఖ్య బాగా పెరిగింది. జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు.

– శ్రీనివాసరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి